# కృష్ణలీలలు

రచన: "శ్రీపతి"



మూర్తి పెళ్ళిచేసుకున్నాడు అన్నారు తోటిమిత్రులంతా... నేను నమ్మలేకపోయేను... అయినా ఏ పుట్టలో ఏ పాముందో!......

"పెళ్ళాముండగ మళ్ళీ పెళ్ళేమిటి!" అని కొందఱు

"ఇంతకూ ఆ పెళ్ళికూతురు ఎవరూ? అని కొందఱు

"మొదటిపెళ్ళాం విడాకు లిచ్చేసిందని" కొందఱు. అయినా ఈ వయస్సులో పెళ్ళేమిటి ... తల్లికి తండ్రికి బుద్ధి వుండక్కర్లే!...అని కొందఱు ఈ విశేషణాలన్ని నా చెవులకి ఒకదాని తరువాత ఒకటి ప్రాకుతునేవున్నాయి.

మూర్తి అసలుపేరు కృష్ణమూర్తి... కృష్ణమూర్తితో పరిచయం లేకపోయినా ఆయన ఫలానా అని మాత్రం తెలుసు. అతను - నేను చూచుకోవడం తప్పితే ముఖాముఖీ మాట్లాడుకోలేదు అంతే...

మూర్తితాలూకాఫీసులో హెడ్‌గుమస్తా మంచి పర్సనాలిటి ... గోల్డుఫ్రేమ్ కళ్ళద్దాలు పెట్టుకుంటాడు ... వయస్సు ముప్ఫై పైబడినా అంత ఉన్నట్లు కనబడదు. పొట్ట మాత్రం ముందుకు చొచ్చుకువచ్చినట్లు కనబడుతుంది... జోస్యంలో కొద్దిగా ప్రావీణ్యం సంపాదించేడు...ప్రస్తుతం ఐదేళ్లనుండీవంటరిగానే వుంటున్నాడు.

మూర్తికి పెళ్లి యెక్కడ జరిగిందో తెలియదుగాని వివాహంమాత్రం జరగడం ఖాయం. అత్తవారిది విశాఖపట్నం పెళ్ళి జరిగి ఆరేళ్ళుదాటినా భార్యని మాత్రం తీసుకురాలేదు. కారణం ఏ వక్కరికికూడా తెలియదు. పెళ్ళి జరిగిన అనంతరం ఒక ఏడాదిమాత్రం జీవితాన్ని అనుభవించాడు. అందుకు నిదర్శనంగా ఒక కూతురు పిల్ల జన్మరేఖ ఎటువంటిదో తెలియదు కాని... ఆనాటినుండి భార్యని చీదరించుకోవడం మొదలుపెట్టేడు. ప్రతివిషయం అతనికి అనుమానం కలిగిస్తూవుంది. ఆ యనుమానంతో భార్యపై అమానుషంగా ప్రవర్తించేవాడు. పాపం భార్య కాంతం...పూర్తిపేరు లక్ష్మికాంతం... ఉత్తమురాలు అని చెప్పవచ్చు. ఎందుకంటే ఎన్నిబాధలుపడినా మీరే నాభర్త అంటుంది ఇప్పటికీను.

కాంతంతల్లి అంటే మూర్తిఅత్తగారు పరమగయ్యాళి. ఇంట్లో ప్రతి వస్తువు దోచుకుపోయేది. తల్లికి భయపడి కాంతం అడ్డుచెప్పేదికాదు...అత్తగారికి మూర్తికి క్షణంపడేదికాదు, వచ్చిననాటి నుండి ఇంట్లో తగువులు నలుగురు నవ్వడాలు జరుగుతుండేవి. ఆ తదుపరి తల్లి కాంతంని, తనింటికి (పుట్టింటికి) తీసుకుపోవడం జరిగింది. ఇది జరిగి ఐదేళ్ళు కావచ్చినా, మూర్తి మాత్రం నిండుకుండలా వున్నాడు. భార్య కాంతంమాత్రం పుట్టింటనే కూతురుతో అష్టైశ్వర్యాలతో అనుభవిస్తూ వుంది. మూర్తి భార్యగూర్చి ఎటువంటి ప్రయత్నమూ చెయ్యలేదు.

మూర్తిమాత్రం కొందరికి పెళ్ళికాలేదని...కొందరికి పెళ్లాం చచ్చిపోయిందని చెబుతూ...అందినవాటిని అందుకుంటూ జీవితశేషాన్ని గడిపేస్తున్నాడు. కొన్నాళ్ళు కాంతానికి నోటీసు లివ్వడం కూడ జరిగింది. విడాకు లిమ్మనికూడ అర్థించేడు కాని కాంతంమాత్రం పుట్టిల్లు విడిచి బయటికిరాలేదు. ఆమె అక్కడ తను యిక్కడ. ఇద్దరికిమధ్య దూరం ఇరవై మైళ్ళు ... బస్సు ప్రయాణం గంటన్నర...

మూర్తి ఉంటున్న ఇంటిప్రక్క వీధిలోని కాసులు తన్ని ప్రేమించిందంటే అతనిలో గొప్ప విశేషముందనుకోవాలి. కాసులు చూపుకి అందంగా వుంటుంది. తెల్లని పాలవంటి శరీరం బొద్దుగా వుంటుంది. గుండ్రటి ముఖం...కళ్లు మాత్రం ఎప్పుడూ ఏదో వెతుకుతూ వున్నట్లుగానే కనబడతాయి. ఆడవాళ్లకి చూపులే శింగారమంటారు...నిజమే ఆ చూపులబాణాలతోనే కాసులు మూర్తిని బంధించింది. ఇద్దరికి ఉత్తరప్రత్యుత్తరాలు కొన్ని వారాలుపాటు జరిగాయి. దాని పర్యవసానం ఒక శుభసమయాన మూర్తిని తన వితిర సందర్శించింది.

అనాటి మధుర ఘడియలు వాళ్ళిద్దరి హృదయాల్లో నాటుకున్నాయి. ఆ శుభ సమయ తారాబలం లగ్నబలం తన జాతకంతో సరిచూచుకున్నాడు కాసులు తనభార్య అయితీరా లనుకున్నాడు... కాసులు తనింటికి వస్తుందన్న విషయం తల్లికిగాని తండ్రికిగాని చివరకు తమ్ముడికి కాదుగదా! ఆ ముక్కంటికికూడ తెలియదు. శుభసమయం రాత్రి పన్నెండు గంటలని వాళ్ళు నిర్ణయించుకున్నారు. అయినా మూర్తివీధిలో అట్టే జనసంచారం వుండదు...సాయంత్రం ఆరు గంటలతోనే ఆ రస్తా ఖాళీగానే వుంటుంది. ఇంతకూ కాసులు రావడమే ఆలస్యం...ఎవరికి తెలియకుండా రావాలంటే మాటలా...ఆవీధి ఎప్పుడూ నిండా బ్రాహ్మణకన్యలతో నవనవ శోభలతో కలకలలాడుతూ వుంటుంది. ఆ వీధిలో విధవలతోబాటు ముసలిఅవ్వలు కూడ ఎంతో అందంగా వుంటారు. ప్రతి మగవాడు అ వీధినే వస్తూపోతూ, ఆ కన్యల సందర్శించి సంతృప్తిపడుతూ వుంటారు. ఆ యాకర్షణే మూర్తినిగూడ ఆ వీధిగుండా బయలుదేర తీసింది... కాసుల్ని చూచేడు ... ప్రేమించేడు... అంతే...!

ఇంత కథ నడిపిన కథకుడు పెళ్లి చేసుకోకుండా ఆమెను అలా చూస్తు ఎలా అన్యాయంచేయగలడు. అందుకే ఒకనాటి శుభసమయాన్న రాత్రి పదకొండు గంటలకి రహస్య బంధుమిత్రులతో రహస్యంగా విజయనగరం శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో దేవుని సన్నిధిని శాస్త్రోక్తంగా వివాహం చేసుకున్నాడు. వారిద్దరి అదర్శప్రేమకి కులగోత్రాలు ఏవి అడ్డురాలేదు. వేణుగోపాలస్వామి వధూవరుల నాశీర్వదించేడో లేక వరం ప్రసాదించేడో కాని పెండ్లిజరిగి నాలుగుమాసాలైనా వాళ్లలో ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా హాయిగా చిలకాగోరింకల్లా జీవితాన్ని సాగిస్తున్నారు.

ఆరోజు మధ్యాహ్నం మూడు గంటల వేళ నేను కొంచెం పనుండి మూర్తి ఇంటిముందునుండి పోతున్నాను. అప్పుడు రిక్షాలో వాళ్లింటిముందు ఒక తల్లి పిల్లా దిగేరు. పిల్లకు ఎనిమిదేళ్లుండొచ్చు తల్లికి సుమారుగ పాతికపైబడి ఉండొచ్చు. ఆమె పెట్టెలోపలపెట్టించి రిక్షావాడికి డబ్బులిచ్చి పంపేసింది. అంతవరకూ ఏ వక్కరు గూడ వచ్చి ఆమెను పరామర్శించలేదు. అ పిల్ల ఆమె కూతురనుకుంటాను. అమ్మా నాన్నేరి అంటూ తల్లిని అడుగుతూంది. ఇదేదో తమాషాగా వుందని ప్రక్కనే పిట్టగోడచాటునుండి చూస్తున్నాను.

ఇంతలో కాసులు వయ్యారంగా నడుంత్రిప్పుతూ...ఎవరండి మీరంటూ అడిగింది.

ఆయనేరి...అంది ఆమె.

ఆయనంటె ఎవరు? అంది కాసులు హుందాగా.

మావారు అంది.

అంటే అనడిగింది కాసులు కుర్చీలో కూర్చుంటూ ఈ యింటి యజమాని... అంది.

మా నాన్నగారు అంది పిల్ల.

కాసులు ఆశ్చర్యంతో గభాలున లేచి మీ నాన్నగారా? మీ రెవరో? పొండి బయటికి అంది గట్టిగా...

అప్పుడనుకున్నాను ఆమె మూర్తి మొదటిభార్య కాంతం అని.

కాంతం వెంటనే కొంగు నడుముకి బిగించి...నువ్వెవత్తవే నన్ను పొమ్మనడానికి!...అసలు భార్యను నేను...నాది అధికారం నువ్వే ఫో అవతలకి అంటూ గట్టిగా అరిచింది.

పెళ్లయి పదేళ్లయినా మొగుడుతో వుండక పరాయివాడితో కులుకుతూ, ఛీ! అంది కాసులు అసహ్యంగా!

నీవా నాకు నీతులు చెప్పేది! రంకు నేర్చింది బొంక నేర్వదటే!...నీ సంగతి నాకు తెలియదనుకున్నావా! ... విశాఖపట్నం కురుపాం మార్కెట్టుదగ్గరడుగు నీసంగతి చెప్తారు. నువ్వేదో పతివ్రతననుకుంటున్నావు అంది కాంతం సాగదీస్తూ!

నేను ప్రేమించి పెళ్లిచేసుకున్నాను! నువ్వు పెళ్ళి చేసుకున్నావు వదిలేసేవు అంతే! ఇక నిన్ను యేలుకునేదేంటి అంది కాసులు.

నా సంగతి నీకేం తెలుసు? నే నెటువంటిదానినో అనకాపల్లిలో అడుగు తెలుస్తుంది? ఇందుకేగా విడాకులిమ్మంటు వ్రాసేరు అంది కాంతం వింతగా!...

కాసులు నలుగురూ చూడటం ఇష్టంలేక పోతావా ఫోవా అంటూ కాంతం మీదికి వచ్చింది!

దానితో ఉగ్రనరిసింహావతారం ఎత్తింది కాంతం ... నన్ను పొమ్మన్నదెవరే...ఏదీ పంపించు చూస్తాను... అంటూ కాసులుమీదికీ తిరగబడింది.

ఇదంతా చూచి నవ్వుకుంటున్నారు వీధిలో వాళ్లు. నాకూ ఇదంతా చిన్న తమాషా అనిపించింది.

ఇంతలో క్రిష్ణమూర్తి గాభరాతో మెట్లెక్కేడు మూర్తి ఎటూ చెప్పలేని సంధిగ్ధంలో పడిపోయేడు. ఏమీ తోచలేదు తనకి. వీధిలో నలుగురూ చూస్తున్నారు. వాళ్ళపోరుమాత్రం తగ్గలేదు. మూర్తిని వాళ్లు చూచేస్థితిలో లేరు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరిమీద ఒకరు తిరగబడుతూ తిట్టుకుంటున్నారు. కూతురు ఇదంతా చూస్తూంది...మూర్తి కూతుర్ని దగ్గరికి తీసుకొని, వీధితలుపు గడియవేసేసేడు. అంతటితో ఆ దృశ్యం అఖరయి అందరితోబాటు నేనూ కదిలిపోయేను.

ఇప్పుడు మూర్తి శ్రీకృష్ణభగవానుని వలె సత్య-రుక్మిణిలా కాంతంని - కాసులుని సమంగా ఏలుకుంటూ జీవిత మాధుర్యాన్ని తనివితీర గ్రోలుతూ ఆనందలోకాల్లో విహరిస్తూ సుఖంగా వున్నాడు. ★